తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

శుక్రవారం | 16 అక్టోబర్ 2026 | పేజీలు : 12

Follow :

## వ్యవసాయాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

**జిల్లా వ్యవసాయ అధికారిణి కె.చంద్రకళ ● ఉత్తమ మహిళా రైతులకు సత్కారం**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి)**

వ్యవసాయ రంగ అభివృద్ధిలో మహిళా రైతుల పాత్ర కీలకమని జిల్లా వ్యవసాయ అధికారిణి కె.చంద్రకళ అన్నారు. అంతర్జాతీయ మహిళా రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం షామీర్‌పేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మహిళా రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ.. విత్తనాల ఎంపిక, పంటల సాగు, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, సస్యరక్షణలో మహిళా రైతుల కృషి ప్రశంసనీయమన్నారు. వ్యవసాయ ఉత్పత్తి పెంపుతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి వారు దోహదపడుతున్నారని తెలిపారు. మహిళా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ రంగంలో విశేష సేవలందిస్తున్న సరసం లక్ష్మి, వంగేటి సమత, బాలమణితో పాటు పలువురు మహిళా రైతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ, అగ్రికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ శిరీష, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





## తెలంగాణ సంస్కృతికి గొప్ప ప్రతీక బతుకమ్మ

**శేరిలింగంపల్లి జెడ్సి నారాయణ్ అమిత్**

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ప్రపంచంలో ఎన్నో సంస్కృతి సాంప్రదాయాలు కొనసాగుతున్నప్పటికీ భారతీయ సంస్కృతికి ఎంతో వైశిష్టం ఉందని, అందులోనూ తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ వంటి ఎన్నో ప్రత్యేకతలు మరింత ఔన్నత్యాన్ని అందిస్తున్నాయని శేరిలింగంపల్లి జెడ్సి నారాయణ్ అమిత్ తెలిపారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కార్యాలయంలోని మహిళా ఉద్యోగులు, మహిళా అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు బతుకమ్మలను పేర్చి ఘనంగా బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా జెడ్సి నారాయణ్ అమిత్ మాట్లాడుతూ బతుకమ్మ అంటే ఒక దేవత అని, గౌరమ్మగా భావిస్తూ పూలను పూజిస్తూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మకు తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని ఈ సందర్భంగా నారాయణ్ అమిత్ పేర్కొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి సిఎంసి అర్బన్ డెవలప్ మెంట్, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాలు నేతృత్వం వహించడం జరిగింది.

## 15 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు

**శ్వేతా రాజు చేతుల మీదుగా పంపిణీ**



**కీసర, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ ఆర్జీకే కాలనీకి చెందిన 15 మంది లబ్ధిదారులకు మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేతా రాజు ముదిరాజ్ గురువారం మంజూరు పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేస్తుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణాదేవి, సైదా ఫాతిమా, మధుకర్‌రెడ్డి, నరేష్, మహేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయోధ్య నగర్‌లో ఆలయ భూమికి రక్షణ కరువు..!

**నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలి**

**బీజేపీ నేత ప్రభాకర్ రెడ్డి**



వార్త లోపలి పేజీలో..

## బతుకమ్మ వేడుకల్లో అరకొర ఏర్పాట్లు

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్15 (జనంసాక్షి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ నిర్వహణలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వేడుకల ఏర్పాట్ల బాధ్యతల్లో కీలక పాత్ర పోషించాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాగార్జున ప్రభుత్వ కళాశాల మైదానంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేసినప్పటికీ, అక్కడికి వచ్చే మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం జరిగిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తాగునీటి సౌకర్యం లేకపోవడం, బతుకమ్మ పాటల కోసం సౌండ్ బాక్సులు కూడా అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**కార్పొరేషన్‌గా మారినా..**

నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి బతుకమ్మ పండుగపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించి, అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయినప్పటికీ, కనీస ఏర్పాట్ల విషయంలోనే లోపాలు కనిపిస్తుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేడుకల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? మైదానంలో ఏర్పాట్లను ముందుగానే పరిశీలించారా? తాగునీరు, సౌండ్ సిస్టమ్ వంటి కనీస అవసరాలు ఎందుకు అందుబాటులో లేవు? ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష నిర్వహించారా? నిర్వహిస్తే ఈ పరిస్థితి ఎందుకు ఎదురైందనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

**కమిషనర్ గారూ.. ఇదేనా మీ పనితీరు..?**

**తాగునీరు లేదు.. సౌండ్ బాక్సులు లేవు..**

**కార్పొరేషన్‌గా మారినా సౌకర్యాల్లో మార్పేదీ..?**





**ఇప్పటికైనా స్పందిస్తారా..?**

బతుకమ్మ అనేది కేవలం ఒక వేడుక కాదు.. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక. అలాంటి పండుగలో కనీస సౌకర్యాల కొరత ఏర్పడటంపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్పందించి, ఏర్పాట్లలో లోపాలపై సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది. బాధ్యులెవరో గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బతుకమ్మ పండుగలోనే కనీస సౌకర్యాలు కల్పించలేకపోతే.. కార్పొరేషన్ ఏర్పాటుతో ప్రజలకు ఒరిగిందేమిటి? నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతారా..? ఇదే విషయమై వివరణ కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసినా మున్సిపల్ కమిషనర్ మాత్రం అందుబాటులోకి రాకపోవడం గమనార్హం..!

# ఎన్,హెచ్ఎం,లను రెగ్యులరైజ్ చేయాలి

### సమాన పనికి సమాన వేతనం కల్పించాలి

### నేషనల్ హెల్త్ మిషన్ డాక్టర్లు

**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 15 (జనం సాక్షి)** శాశ్వత ఉద్యోగులతో సమానంగా నేషనల్ హెల్త్ మిషన్ లో డాక్టర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సమాన హక్కులు కల్పించాలని డాక్టర్ నయాంజాన్, డాక్టర్ ప్రవంతిరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఎన్,హెచ్,ఎం లు నిరవదిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఎన్,హెచ్,ఎం లు నిరవదిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా పనిచేసినా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 17వేల మంది ఉద్యోగులము పనిచేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రెగ్యులరైజ్ కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన ఏడు రాష్ట్రాల్లో రెగ్యులరైజ్ చేసినప్పుడు తెలంగాణలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. ప్రభుత్వం హక్కులు కల్పిస్తూ ఆర్టికల్ 14,16,39 డి ప్రకారం సమాన పనికి సమాన హక్కులు, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. నిత్యవసర ధరల పెరుగుదల వల్ల చాలీచాలని జీతంతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. మహిళ ఉద్యోగులకు 180 రోజులు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని,ఉద్యోగ భద్రత ,ఆరోగ్య బీమా ప్రతి ఉద్యోగికి కల్పించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం లను గుర్తించి రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన వచ్చేంతవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో డాక్టర్ విశ్వేశ్వర్, డాక్టర్ ప్రవంతి రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ చిరంజీవి, శిరీష, డాక్టర్ గౌస్ బాషా, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.




## ఈనెల 20న తాండూర్ లో దసరా వేడుకలకు రండి

## మహేంద్ర రెడ్డికి హిందూ ఉత్సవ కేంద్ర కమిటీ ఆహ్వానం



**తాండూరు అక్టోబర్ 15(జనంసాక్షి)**ఈనెల 20న విజయదశమి దసరా రోజు తాండూర్ పట్టణంలో నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా హిందూ ఉత్సవ కేంద్ర కమిటీ శాసనమండలి ప్రభుత్వ చీఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిని ఆహ్వానించింది.ఈ మేరకు తాండూర్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బిర్కిడ్ రఘు, అధికార ప్రతినిధి పర్యాద రామకృష్ణ, కౌన్సిలర్లు ఎస్. వైశాలి రాజు గౌడ్, అంతారం కిరణ్, వెంకటేష్, సీనియర్ నాయకులు అబ్దుల్ కబీ తదితరులు ఆహ్వాన పత్రిక ను మహేందర్ రెడ్డి కి అందించారు. శాలువాతో సన్మానించారు. ప్రతీ ఏటా సంప్రదాయ బద్ధంగా నిర్వహించే వేడుకలు పార్టీలు కులమతాలకు అతీతంగా సాగుతాయని వారు వివరించారు. ఇందుకు స్పందించిన మహేందర్ రెడ్డి గత 30 ఏళ్లుగా హిందూ ఉత్సవ కమిటీ దసరా కోసం ఆహ్వానించారని తనూ హాజరయ్యానని గుర్తు చేశారు.ఉత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు.

## ఆయిల్ పామ్,తీగజాతి కూరగాయల

## పందిరి సాగుకు రైతులు ముందుకు రావాలి

### ఉద్యానవన శాఖ అధికారులు




**బొంరాస్ పేట, అక్టోబర్ 15 (జనం సాక్షి):** మండల పరిధిలోని నాందార్ పూర్ గ్రామంలో గురువారం వికారాబాద్ జిల్లా ఉద్యానవన శాఖ,పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కోడంగల్ ఉద్యానవన శాఖ ప్రత్యేక అధికారి ఆయిల్ ఫామ్ సాగు ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. తీగజాతి పందిరి కూరగాయల సాగుకు రైతులు ముందుకు రావాలని, ప్రభుత్వము అందించే ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆధునిక సాగు పద్ధతులను అవలంభించడం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఉప సర్పంచ్ అమర్నాథ్ గౌడ్, ఉద్యానవన శాఖ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## రసూల్‌పురాలోని దుర్గామాత అమ్మవారి

## ప్రత్యేక పూజలు



**రసూల్ పుర అక్టోబర్ 15.. (జనం సాక్షి)** రసూల్‌పురాలోని సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్‌రూమ్ వద్ద నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత పండాల్ కు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలో పాల్గొని ఈ దసరా పండుగ లో ప్రజల పై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని దుర్గామాతను వేడుకున్నారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం లో రసూల్ పురం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్,షామ్మెడ్డి, దేవరాజ్, ఫర్దీన్, ఆకాష్ గౌడ్, నిర్వాహకులు బై గౌడ్,అశోక్ తదితరు లు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి మున్సిపల్ కార్మికులకు దసరా బోనస్ ఇవ్వాలి




**అంబర్పేట్ అక్టోబర్ 15 (జనంసాక్షి )**బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా సిఐటియు అంబర్పేట నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో బాగ్ అంబర్పేట్ డి డి కాలనీ ఎస్బిఐ పార్క్ దగ్గర మున్సిపల్ కార్మికులతో కార్మిక బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎం దశరథ్, నగర ఉపాధ్యక్షులు జి. రాములు, గారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు అనేక సంవత్సరాలుగా హైదరాబాద్ నగరం శుభ్రంగా ఉండడానికి నగర ప్రధానికం రోగాల బారిన పడకుండా కాపాడడం కోసం వారి జీవితాలని పణంగా పెట్టి రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రోడ్లు ఊడుస్తూ నగరాన్ని శుభ్రపరుస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు సిఐటియు నగర కమిటీ నుంచి జేజేలు పలుకుతుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం, జిహెచ్ఎంసి, అధికార యంత్రాంగం, మాత్రం మున్సిపల్ స్వీపర్లను కార్మికులుగా కూడా గుర్తించకుండా వారితో నిత్యం పని చేయిస్తూ హైదరాబాద్ నగరాని శుభ్రంగా ఉంచడంలో నిమగ్నమయ్యారు. కానీ వారికి జీతాలు పెంచడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకవైపు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి, ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, నిత్యవసర వస్తువుల ధరలు, పెరిగిపోతున్నాయి. వీరికి మాత్రం అరకొర జీతాలతో ప్రభుత్వాలు వీరితో పని చేపిస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ నాయకులు వీరిని ఎన్నికల వాగ్దానాల కోసం వాడుకోవడం తప్ప, వీరికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు పెంచకపోగా కనీసం సుప్రీంకోర్టు తీర్పు అయిన గౌరవించి సమాన పనికి సమాన వేతనం అన్న ఇవ్వకపోవడం చాలా దుర్మార్గం. ఈ దసరా సందర్భంగా అనేక ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాలజీవులు సవరించి, జీతాలు పెంచుతారు. అలాగే ప్రతి సంవత్సరం దసరా బోనస్ ఇస్తారు. వీరికి మాత్రం కనీస వేతన జీవో సవరించరు, దసరా సందర్భంగా కనీసం బోనస్తులు ఇవ్వరు, పండగ సెలవులు ఇవ్వరు, క్యాజువల్ న్యూస్ ఇవ్వరు, కానీ నిరంతరాయంగా హైదరాబాద్ నగరాన్ని శుభ్రపరుస్తూ ప్రభుత్వానికి అనేక అవార్డు తీసుకురావడం మాత్రం వీరి పని. అని ప్రభుత్వాలు మాత్రం వీరికి జీతాలు పెంచరు. కనీసం తెలంగాణ బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయన మున్సిపల్ కార్మికులకు దసరా బోనస్ ఇచ్చి జీతాలు పెంచాలని వారి డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే కాలంలో వీరి జీతాలు పెరిగే వరకు సిఐటియు సంఘం వీరి తరపున పోరాడుతుందని చెప్పి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అంబర్పేట కార్యదర్శి పి.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ అండాలు, జయశ్రీ, మంజుల, లక్ష్మి, రేణుక, స్వాతి, పద్మ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ.. మధులతా శ్రీనివాస్‌కు ఘన సన్మానం




**తాండూరు అక్టోబర్ 15(జనంసాక్షి)**భారత మాజీ రాష్ట్రపతి, 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను వికారాబాద్ జిల్లా తాండూరులోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సేవాసమితి, బాలల మాసపత్రిక 'మొలక', శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు గాజుల బసవరాజ్, కవయిత్రి మొల్ల కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ కేవీఎం వెంకట్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ మధులతా శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భారతదేశానికి విశేష సేవలందించిన మహనీయుడని కొనియాడారు. సాధారణ కుటుంబంలో జన్మించి, పేపర్ బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించి, తన కృషి, పట్టుదలతో శాస్త్రవేత్తగా, దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన ప్రజల రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తుచేశారు.'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి' అనే సందేశంతో కోట్లాది మంది విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. విద్యార్థులు కలలు కనడమే కాకుండా, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. అబ్దుల్ కలాం జీవితం ప్రతి విద్యార్థికి ఆదర్శమని తెలిపారు.మధులతా శ్రీనివాస్‌కు ఘన సన్మానం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ మధులతా శ్రీనివాస్‌ను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు.ప్రతిభావంతులైన విద్యార్థులకు పుస్తకాల పంపిణీప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవాసమితి గౌరవ అధ్యక్షుడు బసవరాజ్, అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ కేవీఎం వెంకట్, శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, కూటం చంద్రశేఖర్, కవి యూసుఫ్, వెంకట్ వంశరాజు, ప్రభు శంకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు వైశాలి, కార్తీక్, సాయి తేజ, కార్తికేయ, రేవన సిద్దేశ్వర్, అర్జున్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేవాలయ అభివృద్ధికి ప్రాధాన్యత

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు అక్టోబర్ 15(జనంసాక్షి)**తాండూరు పట్టణంలోని శ్రీ సద్గురు పోట్లి మహారాజ్ దేవాలయ వ్యాపార సముదాయ నూతన కాంప్లెక్స్‌లను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దేవాలయ ఖాతాలో కేవలం రూ.4 లక్షలు మాత్రమే ఉండే, ప్రస్తుతం రూ.40 లక్షలకు చేరిందన్నారు. దేవాలయ ఆదాయాన్ని మరింత పెంచుతూ, ఆ నిధులను ఆలయ అభివృద్ధికి వినియోగించుకోవడమే లక్ష్యమన్నారు. భక్తులకు, వ్యాపారులకు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా నూతన వ్యాపార సముదాయాన్ని నిర్మించాం. షాపుల నిర్మాణ విషయంలో పారదర్శకతకు ప్రాధాన్యతనిచ్చామని, చేపట్టే ప్రతి పనిలో జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. శివాలయం, దాసోహం, రాజగోపురం నిర్మాణ పనులు చేపడుతున్న



వారిని ఎమ్మెల్యే అభినందించారు. శ్రీ సద్గురు పోట్లి మహారాజ్ దేవాలయాన్ని ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక వేత్తలు, నాయకులు పాల్గొన్నారు.

## బీరప్పగడ్డ గౌడ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు

### నిధుల మంజూరు పత్రాలను గౌడ సంఘం సభ్యులకు అందజేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, అక్టోబర్ 15 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలోని బీరప్పగడ్డ డివిజన్‌లో గల గౌడ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శ్మశానవాటిక అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల మంజూరు ఉత్తర్వుల ప్రతులను ఉప్పల్ గౌడ సంఘం సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు పరమేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఆయా ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. వివిధ శ్మశానవాటికలకు నిధుల కేటాయింపుఉప్పల్ నియోజకవర్గంలో ఇప్పటికే పలు శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ కుమ్మరి సంఘం శ్మశానవాటికకు రూ.25 లక్షలు, ఉప్పల్ కుర్మ సంఘం శ్మశానవాటికకు రూ.25 లక్షలు, చిలుకానగర్ క్రైస్తవ శ్మశానవాటికకు రూ.25 లక్షలు, ఉప్పల్ బ్రాహ్మణ వైశ్య శ్మశానవాటికకు



రూ.25 లక్షలు, ఉప్పల్ రెడ్డి శ్మశానవాటికకు రూ.25 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే రామంతాపూర్‌లోని నేతాజీ నగర్, రాజేంద్ర నగర్ శ్మశానవాటికల అభివృద్ధికి కలిపి రూ.72 లక్షలు కేటాయించినట్లు వివరించారు. తాజాగా బీరప్పగడ్డ గౌడ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని తెలిపారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, కాలనీల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గౌడ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## అయోధ్య నగర్‌లో ఆలయ భూమికి రక్షణ కరువు

### ఫిర్యాదులు ఎన్ని చేసిన ఆగని నిర్మాణం

### నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలి : బీజేపీ నేత ప్రభాకర్ రెడ్డి

**బోడుప్పల్-జనంసాక్షి::**దేవాలయ నిర్మాణం కోసం కేటాయించిన స్థలానికే రక్షణ లేకుండా పోయిందని అయోధ్య నగర్ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ అయోధ్య నగర్ కాలనీలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం కేటాయించినట్లు చెబుతున్న భూమిలో నిర్మాణ పనులు కొనసాగుతుండటంపై వివాదం నెలకొంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా నిర్మాణం ఆగకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐదు సర్వే నంబర్ల పరిధిలో 500 గజాల స్థలంమేడిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 50, 51, 52, 53, 54 లలో ఉన్న అయోధ్య నగర్ కాలనీ లేఅవుట్‌లో సుమారు 500 గజాల స్థలాన్ని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం కేటాయించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే సదరు స్థలంపై కొందరు వ్యక్తులు హక్కులు పొందినట్లు చూపిస్తూ ప్లాట్లుగా విభజించి విక్రయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడ నిర్మాణం చేపట్టడంతో ఆలయ స్థల పరిరక్షణపై వివాదం తలెత్తింది. ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం? ఆలయ స్థలంలో నిర్మాణం జరుగుతోందని కాలనీవాసులు, పలువురు రాజకీయ నాయకులు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, డిప్యూటీ కమిషనర్ శైలజ, ఏసీపీ నాగిరెడ్డితో పాటు ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని సమస్య పరిష్కారానికి చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోని పార్కులు, ఆలయాల కోసం కేటాయించిన స్థలాలను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం.. ఫిర్యాదులు అందిన తర్వాత కూడా



పరిస్థితిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. తక్షణమే ఆలయ స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, భూమి హక్కులపై స్పష్టత ఇవ్వడంతో పాటు వివాదం తేలే వరకు నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలయ స్థలాన్ని కాపాడే వరకు పోరాటం ఆగదు : ప్రభాకర్ రెడ్డిఅయోధ్య నగర్ కాలనీలో ఆలయ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారంటూ మేడిపల్లి బీజేపీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులకు, ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేదని ఆయన విమర్శించారు. ఆలయ స్థలాలకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్లకు భద్రత ఎక్కడుంటుందని ఆయన ప్రశ్నించారు. అమాయక ప్రజలకు ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకున్న వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద స్థలంలో నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, రికార్డులను పరిశీలించి ఆలయ భూమిని పరిరక్షించాలని కోరారు. ఆలయ స్థలానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### తాండూరు సివిల్ కోర్టులో న్యాయవాదులతో సమావేశం మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి



**తాండూరు అక్టోబర్ 15(జనంసాక్షి)**తాండూరు పట్టణంలోని సివిల్ కోర్టులో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి గురువారం న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు



**కేశంపేట, అక్టోబర్ 15 ( జనం సాక్షి ) :** మండల పరిధిలోని సంగం గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, సీఐ బి. శ్రీనివాస్, ఎస్సై పరమేష్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కరుణ కటాక్షం ప్రజలందరిపై ఉండి ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన జవాజీ శాంతమ్మ నాగభూషణం గౌడ్ దంపతులు దుర్గాదేవి మండప ప్రాంగణంలో చేపట్టిన అన్నదాన ప్రసాద వితరణలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## నేడు ప్రత్యేక గ్రామసభలు

**కేశంపేట అక్టోబర్ 15 (జనం సాక్షి ) :** మండలంలోని వివిధ గ్రామాలలో నేడు ప్రత్యేక గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలలో ఎల్ నినో ప్రభావంతో సంభవించే వాతావరణ మార్పులు, తక్కువ వర్షపాతం, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టే ముందస్తు ప్రణాళికల పై చర్చించడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

### నేడు మక్తల్, నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ ప్రజాభిప్రాయ గ్రామసభ

**బొంరాస్ పేట, అక్టోబర్ 15 (జనం సాక్షి):** మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూసేకరణ పై ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభ శుక్రవారం ఉదయం 10 గంటలకు బొంరాస్ పేట, ఉదయం 11:30 గంటలకు నాందర్పూర్ గ్రామాలలో గ్రామసభలు తహసిల్దార్ పద్మావతి ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని ఆర్ఐ శిరీష తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేయాలని కోరారు.

## రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలికి సన్మానం



**రాజేంద్రనగర్, అక్టోబర్15(జనంసాక్షి)**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నరసింహారెడ్డిని, రాష్ట్ర హ్యాండ్లూమ్ చైర్మన్ జక్కని అనితను హైదర్గూడా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడుసామ ఇంద్రపాల్ రెడ్డి గాంధీభవన్‌లో పుష్పగుచ్ఛం, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై వారితో చర్చించారు.

## నాగసాన్‌పల్లిలో మహిళ అనుమానాస్పద మృతి

### భర్త,పెద్దకుమార్తె వేధించారంటూ సోదరుడి ఆరోపణ



కోట్‌పల్లి అక్టోబర్ 15(జనంసాక్షి): వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం నాగసాన్‌పల్లి గ్రామానికి చెందిన మంగమొల్ల సుశీల (52) ఈ నెల 14న అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు ఎర్రోళ్ల రాములు పోలీసులను కోరారు.రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ ఆస్తిని పెద్ద కుమార్తె చంద్రకళకే ఇవ్వాలని భర్త సంజీవయ్య ఒత్తిడి చేయగా, ఆస్తిని ఇద్దరు కుమార్తెలకు సమానంగా పంచాలని సుశీల కోరినట్లు తెలిపారు. ఈ విషయమై భర్త సంజీవయ్య, పెద్ద కుమార్తె చంద్రకళ కలిసి సుశీలను మానసికంగా, శారీరకంగా వేధించారని ఆయన ఆరోపించారు. గతంలోనూ వేధింపులపై మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో సుశీల మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని, ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని రాములు పోలీసులను కోరారు. ఆయన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

## ఘనంగా బతుకమ్మ, దుర్గామాత వేడుకలు

### జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్



హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 15 (జనం సాక్షి) : హైదరాబాద్ జిల్లా అంబర్‌పేట క్లస్టర్ పరిధిలోని బాగ్ అంబర్‌పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం దుర్గామాత పూజలు, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా మహిళల ఆత్మగౌరవానికి సంకేతంగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిపై ప్రేమ, సమాజంలో సామరస్యం, ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ ఆరోగ్యకరమైన సంప్రదాయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా.శ్రీధర్, డా.శ్రీకళ, డా.ఆశ్రిత రెడ్డి, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇన్‌చార్జి మలేరియా అధికారి ఆంజనేయులు, అంబర్‌పేట క్లస్టర్ వైద్యాధికారులు డా.హరిశ్రీ, డా.దీప్తి పటేల్‌తో పాటు పర్యవేక్షక, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి

### బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ జిల్లా కన్వీనర్ శ్రీరామ్ వెంకట్



సికింద్రాబాద్ (జనంసాక్షి)అర్హులైన ప్రతి పట్టభద్రుడు బాధ్యతగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని మహంకాళి జిల్లా బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్ పిలుపునిచ్చారు. బీజేపీ తార్నాక డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక ఎక్స్ రోడ్స్ వద్ద బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి , హరి, డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు మల్లేశ్వరి, అనూష, పవన్, కృష్ణ గౌడ్, ప్రకాష్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

### పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



అమీర్‌పేట్ (జనం సాక్షి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రముఖ ఆలయాలను దర్శించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.రాంగోపాల్‌పేటలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని దర్శించుకున్న ఆయనకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మహంకాళి అమ్మవారిని, భవానీమాత అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.అనంతరం అమీర్‌పేట్ డివిజన్ కుమ్మరిబస్తీలోని హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి బాలా త్రిపురసుందరి అలంకారంలో ఉన్న అమ్మవారికి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ తల్లిని, గాయత్రీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బేగంపేటలోని కట్ట మైసమ్మ ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాల చైర్మన్లు, ఈఓలు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## అలియాబాద్ మున్సిపాలిటీలో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



శామీర్ పేట్, అక్టోబర్ 15(జనం సాక్షి ) అలియాబాద్ మున్సిపాలిటీ మజీద్ పూర్ గ్రామం 11వ వార్డులో అంతయిపల్లి నవనీత నగేష్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ,ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, ,అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ లు పాల్గొని గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సామల జశ్వంత్ రెడ్డి, నరసం వనజ అశోక్ రెడ్డి, ముద్దం సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ తుంకి బిక్షపతి,కాంగ్రెస్ నాయకులు బందరి బాబు, అబ్బాగౌని భాస్కర్ గౌడ్ , గిర్మాపూర్ నర్సింగ రావు గౌడ్,ఉరడి వెంకటేష్,నాటకారి వెంకటయ్య మేడి మల్లేష, చిలుగురి మల్లేష్, చాట్లపల్లి నర్సింగ రావు,కొమ్ము వినోద్,కుడుముల వెంకటేష్,వీరన్నగారి భూపాల్ పల్లె రాంబాబు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ లాడ్స్ నిధులతో రూ.43 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

### చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



చేవెళ్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి): చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నిధులను ప్రాధాన్యతా క్రమంలో వినియోగిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీ, మండల పరిధిలోని పల్లెట్లలో రూ.10 లక్షలు, మల్కాపూర్‌లో రూ.10 లక్షలు, ధర్మసాగర్‌లో రూ.5 లక్షలు, దేవుని ఎర్రవల్లిలో రూ.18 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డితో కలిసి ఎంపీ ప్రారంభించారు. నాలుగు వార్డులలో మొత్తం రూ.43 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం మొత్తం రూ.5.90 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో చేవెళ్ల మున్సిపాలిటీ, మండల పరిధిలోని అభివృద్ధి పనుల కోసం రూ.1.92 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, స్థానిక సమస్యలను పరిష్కరించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ, చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మున్సిపల్ కౌన్సిలర్లు మనీషా అనంత్ రెడ్డి, కరికె మీనాక్షి సత్యనారాయణ, మాధవి యాది రెడ్డి, దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, సామ మాణిక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.వైభవ్ రెడ్డి, గోటూరి జయశంకర్ గౌడ్, పత్తి సత్యనారాయణ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అవతారంలో అమ్మవారికి కొలన్ శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 15( జనం సాక్షి)నిజాంపేట్ సర్కిల్ నిజాంపేట గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రులలో భాగంగా అమ్మవారు ఐదవ రోజు గురువారం మహాలక్ష్మి అవతారంలోని అమ్మవారికి ప్రత్యేక పూజల్లో భాగంగా చండీ హోమం లో పాల్గొని పూజలు నిర్వహించారు ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులు అమ్మవారి శేష వస్త్రంతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేసి నిండు నూరేళ్ల అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. అనంతరం కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా, సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఆలయ ప్రధానార్చకులు మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో భాగంగా 5వ రోజు కనకదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారని అమ్మవారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు, భోగభాగ్యములు, ఉద్యోగ, వ్యాపారంలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. నవరాత్రులలో ప్రతిరోజు ఆలయ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట గ్రామ ప్రజలు భక్తులు దుర్గామాత మాలధారణ వారు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదలను స్వీకరించారు.



# చర్లపల్లి లో ఘనంగా కార్మిక బతుకమ్మ సంబరాలు

**కాప్రా, అక్టోబర్ 15 (జనం సాక్షి ):** చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ తెలంగాణలో దసరా పండుగను పెద్ద ఎత్తున సాంప్రదాయం పద్ధతిలో ఘనంగా జరుపుకుంటారని అన్నారు ముఖ్యంగా మహిళలు తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలలో పేర్లతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంతోషంగా నిర్వహిస్తారని అన్నారు. పూలను పూజించే సమాజం ఆడపిల్ల పుట్టినప్పుడు వివక్ష చూపడం బాధాకరమని అన్నారు. బతుకమ్మ అంటే బతుకు అమ్మ అని అర్థం వస్తుందని అన్నారు. అందుకే ఆడపిల్లను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం ఎదగనిద్దాం అని అన్నారు. మహిళా హక్కులకై మహిళల వేధింపులపై పని ప్రదేశంలో లైంగిక హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాలని అన్నారు. మహిళలకు సమాజంలో సమాన హక్కులు కల్పించాలని వివక్షలేని సమాజం నిర్మాణం కోసం అందరం కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ అశోక్ చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బివి



సత్యనారాయణ జి శ్రీనివాసులు జిల్లా కోశాధికారి పి గణేష్, మేడ్చల్ జిల్లా ఆశ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి రేవతి, వివిధ యూనియన్ల ప్రధాన కార్యదర్శిలు ఎస్ ఎస్ మణికంఠ టి నరసింహ కే బాలరాజు, టి రవీందర్ రెడ్డి, ఆదామ్, సంతోష్, శ్రీనివాస్, రాంబాబు, మన్మధరావు, చారి, సుబ్రహ్మణ్యం, నరసమ్మ మరియమ్మ,లావణ్య, మోక్షలక్ష్మి, పద్మ, అనిత విజయ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సంక్షేమ పథకాలు అర్హులకు దక్కాలంటే స్మార్ట్ రేషన్ కార్డు తప్పనిసరి

### దేవరాంపల్లి గ్రామ సర్పంచ్ అంత నొల్ల అశోక్

**మోమిన్ పేట అక్టోబర్ 15 ( జనం సాక్షి)**తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో పంపిణీ చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు అందాలంటే స్మార్ట్ కార్డు తప్పనిసరి దేవరంపల్లి గ్రామ సర్పంచ్ అంత నోళ్ళ అశోక్ పేర్కొన్నారు గురువారం మోమిన్ పేట మండల పరిధిలోని దేవరంపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నాయకత్వంలో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులందరికీ సన్న బియ్యం వంటి పథకాలు అమలుపరుస్తున్న ఘనత ప్రజాపాలన ప్రభుత్వానికే దక్కిందన్నారు, ఈ కార్యక్రమంలో దేవరంపల్లి ఉపసర్పంచ్ సుభాన్ రెడ్డి



గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంతా నోళ్ళ ప్రవీణ్ పంచాయతీ కార్యదర్శి ఆనంద్ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పెండింగ్ యూజీడీ పనులకు నిధులు మంజూరు చేయాలి

### హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఈడీ పంకజను కోరిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**హయత్ నగర్, అక్టోబర్ 15 (జనం సాక్షి)**ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులు కేటాయించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మల్కాజిగిరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు కాలనీల్లో కొత్తగా చేపట్టాల్సిన డ్రైనేజీ పనులతో పాటు, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. బైరామల్‌గూడలోని గోకుల్ ఎన్‌క్లేవ్, హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సిరిహిల్స్, శ్రీ గాయత్రి నగర్, దత్తాత్రేయ నగర్, బెల్లయాదవ్ నగర్, సాయిరాం నగర్, శ్రీ వినాయక నగర్, శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీల్లో డ్రైనేజీ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే హస్తినాపురం డివిజన్ పరిధిలోని డైమండ్ కాలనీ, సుల్తాన్ వాల్యా వీకర్ సెక్షన్, శ్రీ వెంకటేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ ఫేజ్-2, హస్తినాపురం రెసిడెన్షియల్ కాలనీ, ఖాద్రి కాలనీల్లోనూ యూజీడీ పనులకు అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సి.ఎస్.ఆర్. కాలనీ, సి.ఆర్. ఎన్‌క్లేవ్, జడ్జెస్ కాలనీ ఫేజ్-1, శ్రీరామ్ నగర్; బి.ఎన్.రెడ్డి నగర్



డివిజన్ పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్, శ్రీపురం; చైతన్యపురి డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ; వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శారద నగర్; కొత్తపేట డివిజన్ పరిధిలోని గణేష్ నగర్, సత్య నగర్, రాజీవ్ గాంధీ కాలనీ; నాగోల్ డివిజన్ పరిధిలోని ఆప్కో కాలనీ, గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కాలనీల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనిపై ఈడీ పంకజ స్పందిస్తూ, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమర్పించిన నివేదిక ఆధారంగా కొన్ని పనులకు ఇప్పటికే అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రధాన సమస్యలు ఉన్న కాలనీల్లో డ్రైనేజీ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

# మేడిపల్లి మండల స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

### 31 మంది ఉప కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం

**బోడుప్పల్-జనంసాక్షి:**:మేడిపల్లి మండల నూతన స్వర్ణకార సంఘం ఉప కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం పూర్తి స్థాయి ఉప కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా స్వర్ణకార సంఘం నాయకుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కత్రోజు వేణుగోపాల్ చారి,జిల్లా ఉపాధ్యక్షుడు తాడోజు సుదర్శన చారి,జిల్లా గౌరవ సలహాదారు సిరిపురం సర్వేశ్వర చారిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన 31 మంది ఉప కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉప కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ..స్వర్ణకారుల సంక్షేమం,ఐక్యతే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ,



సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. స్వర్ణకారుల ఐక్యత,అభ్యున్నతి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కొండపర్తి నర్సింహా చారి,వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లనాగుల మహేష్ చారి,ప్రధాన కార్యదర్శి పడకంటి కుమార్ చారి,కోశాధికారి పానుగంటి నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## మామిడికుంట చెరువు నాలా పైవిచారణ చేపట్టాలి

### మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు వినయ్ రెడ్డి



**రాజేంద్రనగర్,అక్టోబర్15(జనంసాక్షి)**రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్‌పహాడ్ మామిడికుంట చెరువుకు నీరు చేరే ప్రధాన నాలా కనిపించని పరిస్థితిపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి డిమాండ్ చేశారు. నాలా ప్రాంతంలో పైపుల పనులు జరుగుతున్న నేపథ్యంలో సహజ నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పనులకు సంబంధించిన అనుమతులు, నాలా హద్దులు, చెరువులోకి నీరు చేరే మార్గంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. నాలాను సర్వే చేసి, నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉంటే తొలగించి చెరువు ఇన్‌లెట్‌ను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం

### 22వార్డు కౌన్సిలర్ అజయ్ కుమార్



**శామీర్ పేట్, అక్టోబర్ 15(జనం సాక్షి )**మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని అద్రాస్ పల్లి గ్రామంలో 22వ స్థానిక కౌన్సిలర్ ఆది అజయ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ భూలక్ష్మి మొబైల్ ఐ క్యాంప్ దిల్ సుఖ్ నగర్ వారు ఐక్యాంప్ నిర్వ హించారు. ఈ క్యాంపులో 52 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. దూరం చూపు, దగ్గరి చూపు, తలనొప్పి,కంటి శుక్లలు పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లలు ఉన్నవారికి ఆపరేషన్ చేసుకోవాలని సూచించారు. 10మందికి కంటి అద్దాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఆది అజయ్ కుమార్ మాట్లాడుతూ.. 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అన్ని ఇంద్రియాలలో కళ్ళు ఎంతో ముఖ్యమైనవి అని అన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కంటి చూపు విషయంలో ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కౌన్సిలర్ ఆది అజయ్ కుమార్ ముందడుగు వేస్తూ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం సిబ్బంది, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## హెచ్.బీ కాలనీ ఇందిరానగర్‌లోనీ అమ్మవారి ప్రత్యేక పూజలు



**కాప్రా, అక్టోబర్ 15 (జనం సాక్షి)** : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హెచ్.బీ కాలనీ ఇందిరానగర్ చౌరస్తాలో భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్రెడ్డి గొల్లూరి అంజయ్య తో పాటుగా నాయకులు వంజరి ప్రవీణ్ బత్తుల శ్రీకాంత్ యాదవ్ పూజలు నిర్వహించగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు శంకర్ యాదవ్, గుమ్మడి జంపాల్ రెడ్డి, పూస రమేష్, నిశాంత్ కుమార్, శ్రీనాథ్ గౌడ్, మహేష్ గౌడ్,చింటూ యాదవ్,శ్రావణ్,చందు రెడ్డి, పప్పు రెడ్డి,కంచర్ల రమేష్, ప్రకాష్ రెడ్డి,లింగా నాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు..

## మోరంగ్,పల్లి గ్రామంలో విబిజిరాంజి పనులను పరిశీలించినఎంపిడిఓ సృజన సాహిత్య

**మోమిన్ పేట అక్టోబర్ 15(. జనం సాక్షి)**విబిజిరాంజి,కార్యక్రమంలో జరుగుతున్న ఫారం పండు, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో,సృజన సాహిత్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సృజన సాహిత్య, సర్పంచ్ అరుణ బిచ్చయ్య, ఏపీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి రాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి

## దుండిగల్ సర్కిల్ ఆఫీస్‌లో బతుకమ్మ వేడుకలు



**కుతుబుల్లాపూర్ అక్టోబర్ 15 (జనం సాక్షి)**దుండిగల్ సర్కిల్ 59 కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు, ఆర్‌పీ (ఆర్ పి)లు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి , సాంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలతో కోలాహలంగా వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం సంతోషదాయకమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఏఎంసి (ఏఎంసి) లక్ష్మయ్య , వార్డు ఆఫీసర్లు, ఆఫీసు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించాలని సిఎంసి కమిషనర్ను కోరిన మన్నె రాజు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 15 (జనం సాక్షి.)**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఎస్ ఆర్ నాయక్ నగర్ కు సంబంధించిన పలు సమస్యలపై గురువారంమేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన , ఐఏఎస్ అధికారిని కలిసి పలు అభివృద్ధి పనులపై కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగింది.. ఈ సందర్భంగా ఎస్.ఆర్. నాయక్ నగర్ సంపు స్థలాన్ని కాలనీ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకునేందుకు సహకరించాలని మన్నె రాజు తెలియజేయడంతో. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారితో చర్చించి తన వంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్. నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ బాబి , మాజీ ప్రెసిడెంట్ టక్ శ్రీను , కిషోర్ , చంద్రకాంత్ కాలనీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి
### సర్పంచ్ కుమ్మరి సౌభాగ్య లక్ష్మి నాగప్ప



**కొడంగల్, అక్టోబర్ 15 (జనం సాక్షి):**వర్షపు నీటిని వృథా చేయకుండా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవాలని అంగడి రాయిచూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి సౌభాగ్య లక్ష్మి నాగప్ప గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకొని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు నీటిని సంరక్షించకపోతే భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గిపోయి తాగునీటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించడం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. అంతేకాకుండా వర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా అడ్డుకోవడం ద్వారా నీటి కొరతను కొంతవరకు నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ, వర్షపు నీటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం నీటిని సంరక్షిస్తేనే భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా అందించగలమని, గ్రామంలో భూగర్భ జలాల పెంపునకు ప్రజలందరూ సహకరించాలని అన్నారు.

# గాయత్రి ఆలయంలో వనదుర్గ దేవిగా అమ్మవారు

**శామీర్ పేట, అక్టోబర్ 15 (జనం సాక్షి )** శ్రీగాయత్రి మహాక్షేత్రంలో కన్నుల పండవగా శరన్నవరాత్రోత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ, శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వేదబ్రహ్మణుల మంత్రోశ్చరణల మధ్య గురువారం శరన్నవ రాత్రోత్సవాలు కొనసాగాయి. ఐదవ రోజు అమ్మ వారిని వనదుర్గ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాసన, ఋత్విక్ గరణము, అంకురార్పణము, కళశస్థాపన, అనుష్ఠానములు జరిపారు. ఉదయం అమ్మ వారికి ఉపనిషత్పూర్వక అభిషేకము, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, వేద పారాయణం, చండీ సప్తశతీపారాయణ, చండీ హోమం, దేవి భాగవత పారాయణము, శ్రీ చక్ర నవవర్ణార్చన, త్రికాల సహస్ర నామార్చనలు, తీర్థప్రసాద వితరణ చేశారు. అలాగే మధ్యాహ్నం 3-30 గంటల నుంచి చండీ హోమము. సాయంత్రం 5-30 గంటల నుంచి శ్రీ చక్ర నవావరణార్చన, సాయంత్రం 6-30 గంటల నుంచి లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీ సూక్త పారాయణం, వేద స్వస్తి, దేవి భాగవత ప్రవచనం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు మహామంత్రపుష్పం, దర్బారు సేవ, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం



చేశారు. ఈ పూజల్లో ఉమ్మడి మండలం భక్తులతో పాటు నగరానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలో.... ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. మంటపాలలో అమ్మవారిని ఏర్పాటు చేసి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఆయా గ్రామాలలోని అమ్మవార్ల ఆలయాలలో శరన్నవరాత్రోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి.

## నిజాంపేట్‌లో కార్స్ ఎక్స్ఛేంజ్ మేళాను ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 15 (జనం సాక్షి)**నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని నిజాంపేట్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్స్ ఎక్స్ఛేంజ్ మేళాను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ ఎం సి) మాజీ డిప్యూటీ మేయర్ శనిగల ధనరాజ్ యాదవ్ , నిజాంపేట్ సిఎంసి, బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ లు కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరెడ్డి, ఆనంద్ రెడ్డి, ప్రదీప్, కురుమూర్తి, చంద్రయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యూ ట్రస్ట్ హెచ్ఓ వేణుబాబు కట్టా, సేల్స్ మేనేజర్ కృష్ణారెడ్డి, యూ ట్రస్ట్ మేనేజర్ వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ మేనేజర్ షకీర్ బాషాలి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన



నాయకులు, కార్స్ ఎక్స్ఛేంజ్ మేళా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వినియోగదారులకు కార్ల కొనుగోలు, విక్రయాలు, ఎక్స్ఛేంజ్ సేవలను ఒకే వేదికపై అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# భాగ్యమ్మతో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ఓల్డ్ బోయిన్పల్లి అక్టోబర్ 15.. (జనం సాక్షి)** ఆడబిడ్డలకు అత్యంత ప్రీతికరమైన పండుగలో బతుకమ్మ పండుగ ఒకటని తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ బతుకమ్మ పండుగ అని ఓల్డ్ బోయిన్ పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. ఓల్డ్ బోయినపల్లి మరియు హస్మత్పేట్ డివిజన్ల మహిళల ఆధ్వర్యంలో భాగ్యమ్మతో కలిసి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముద్దం నర్సింహ యాదవ్ కుటుంబ సమేతంగా పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ గారు మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలందరూ సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో ఇక మహిళా రాజకీయాలకు విప్లవత్మక పునాది

### రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**రంగారెడ్డి, అక్టోబర్ 15 (జనంసాక్షి)** : 130 సంవత్సరాలకు పైగా సుదీర్ఘమైన రాజకీయ ప్రస్థానం కలిగిన కాంగ్రెస్ మొదటి నుండి పేద బడుగు బలహీన వర్గాల పక్షపాతి అని, ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ రాజకీయాలలో మహిళా సోదరీమణులుసైతం ఎంతో క్రియాశీల పాత్రను పోషిస్తూ ఉన్నతమైన స్థానాలకు చేరుకుంటున్నారని, దీనికి నిదర్శనంగా తనకు లభించిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు పదవి ఒకటని నూతన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ(డిసిసి) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు గాంధీభవన్‌లోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో గురువారం తాను నూతనంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఏర్పాటుచేసిన మొదటి ప్రసంగంలో కాంగ్రెస్ మహిళలోకాన్ని ఆమె ఆకాశానికి ఎత్తేశారు. అంతకుముందు గాంధీభవన్ లోని తన కార్యాలయంలో వేదమంత్రోచ్చారణలు, పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ బాధ్యతల స్వీకార కార్యక్రమానికి రవాణా మరియు బిసి సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై తనకు నూతన అధ్యక్షురాలిగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని, ఈ సందర్భంగా ఆయనకు వినమ్రంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. తన హయాంలో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటానికి నిజాయితీగా ముందుకు సాగుతానని,



ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సంక్షేమమే లక్ష్యంగా వారికి అండదండలు అందిస్తానని పారిజాత నర్సింహారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వానికి, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని, కాంగ్రెస్ పార్టీకి పునాది అయినా ప్రతి కార్యకర్తను పార్టీ కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ ఓవైపు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూనే మరోవైపు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడం ద్వారా వారి జీవిత ఉన్నతికి తప్పకుండా కృషి చేస్తానని చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు వి. హనుమంత్ రావు, చల్లా నర్సింహారెడ్డి, పట్నం సునీత మహేందర్ రెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, సరితా తిరుపతయ్య, చరణ్ కౌశిక్ యాదవ్, రఘునాథ్ యాదవ్, కాల్వ సుజాత, సామ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని నూతన అధ్యక్షురాలిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# పేదల వైద్యానికి సీఎం సహాయ'హస్తం'

## ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాంతు కుమార్



**దోమ అక్టోబర్ 15 జనం సాక్షి:**అనారోగ్యం ఒకవైపు.. ఆర్థిక ఇబ్బందులు మరోవైపు.. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలకు కుటుంబ సభ్యుల వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయి. అప్పులు చేసి చికిత్స చేయించుకునే పరిస్థితుల్లో ఉన్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థికంగా అండగా నిలుస్తోంది. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ఈ నిధి వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ దోమ మండల అధ్యక్షుడు శాంతి కుమార్ అన్నారు.గురువారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన పలువురు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామమోహన్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులనుమంజూరు చేయించి బాధితులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో కుటుంబ పెద్దలు, సంపాదించే వ్యక్తులు ఇబ్బందులు పడుతున్నప్పుడు వైద్య ఖర్చుల కోసం డబ్బులు సమకూర్చుకోవడం పేద కుటుంబాలకు పెద్ద సవాలుగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయం అందడం బాధిత కుటుంబాలకు కొంత ఊరటనివ్వనుందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరైనా తీవ్ర అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చులు భరించడం కష్టమవుతుందని,ఆపద సమయంలో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడం బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్,లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసి విద్యుత్ ఉజ్వల భవిష్యత్

## భాస్కర ఫార్మసీ జె బి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ జె.వి కృష్ణారావు



**మొయినాబాద్ జనం సాక్షి అక్టోబర్ 15:**ఫార్మసీ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రపంచ దేశాలలో ఉజ్వల భవిష్యత్ ఉందని ఉద్యోగాలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానంతో సొంత కంపెనీలు ఏర్పాటుకు కృషి చేసుకోవచ్చునని భాస్కర ఫార్మసి కాలేజ్ జె బి గ్రూప్ కళాశాల సెక్రెటరీ జెవి కృష్ణారావు అన్నారు గురువారము మండల పరిధిలోని అండాపూర్ చౌరస్తాలో గల భాస్కర ఫార్మసి కళాశాలలో గురువారము గ్రాడ్యుయేషన్ డే ను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేవీ కృష్ణారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని సూచించారు చక్కగా చదువుకునేందుకు క్రమశిక్షణ అలమరుచుకోవాలని తెలిపారు నేటి సమాజంలో పోటీ తత్వం ఎంతో పెరిగిందని ఆయన అన్నారు కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యుత్ పాటు ప్రాక్టికల్స్ పరిశోధన నిర్వహించడం జరుగుతుందని వారికి అన్ని విధాలుగా కళాశాల తరఫున కృషి చేస్తున్నామని అన్నారు విద్యార్థుల తల్లిదండ్రులు కేవలం కళాశాలకు పంపుతున్నామని అనుకోకుండా వారి నడవడికను గమనించాలని సూచించారు కళాశాలలో మంచి ఫ్యాకల్టీతో అధ్యాపకులు విద్యను బోధించడం జరుగుతుందని పేర్కొన్నారు ఫార్మసి విద్యలో గతంలో చదివిన విద్యార్థులు వివిధ పరిశోధకులుగా సైంటిస్టులుగా వ్యాపారస్తులుగా ఎంతోమంది విదేశాలకు వెళ్లడం జరిగిందని పేర్కొన్నారు విద్యార్థుల భవిష్యత్తు భాస్కర ఫార్మసీ కళాశాల ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ సంజయ్ ఫార్మసి ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసరావు హెచ్ఓడి డాక్టర్ కిషోర్ బాబు ఏవో శ్రీనాథ్ అకౌంటెంట్ సతీష్ బాబు అధ్యాపకులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బాలాజీ నర్సింగ్ హోంలో అరుదైన కాలు శస్త్ర చికిత్స విజయవంతం

## తెగిపోయే స్థితిలో ఉన్న కాలును కాపాడిన వైద్యులు

**తాండూరు అక్టోబర్ 15(జనంసాక్షి)** ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిని, తెగిపోయే పరిస్థితికి చేరుకున్న ఓ వ్యక్తి కాలుకు తాండూరులోని బాలాజీ నర్సింగ్ హోంలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు.బాధితుడి కాలు పాదం పై భాగం పూర్తిగా నలిగిపోయి, ఎముకలు, కండరాలు బయటకు వచ్చి, రక్తస్రావం ఎక్కువగా జరిగింది. ఇలాంటి స్థితిలో సాధారణంగా కాలు తొలగించాల్సి వస్తుంది. కానీ బాలాజీ నర్సింగ్ హోం వైద్య బృందం అత్యంత ధైర్యంతో సవాల్ గా తీసుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులుమోకాలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ బి. విహాసిత్ మాట్లాడుతూ రోగి మా వద్దకు వచ్చే సమయానికి పాదం పూర్తిగా క్రష్ అయ్యిఉంది. వెంటనే ఎమర్జెన్సీలో అత్యాధునిక ఎక్స్ టర్నల్ ఫిక్సేటర్ విధానంలో శస్త్ర చికిత్స చేశాం.



నలిగిన ఎముకలను సరైన ఆకృతిలో అమర్చి, రాడ్ల సహాయంతో బిగించాం. కుట్లు వేసి, ఇన్ఫెక్షన్ రాకుండా ప్రత్యేక చికిత్స అందించామని తెలిపారు.ప్రస్తుతం రోగి కోలుకుంటున్నారని, కాలు తొలగించకుండా కాపాడగలిగామని వైద్యులు తెలిపారు. ఇలాంటి సంక్లిష్టమైన, అరుదైన శస్త్ర చికిత్సల కోసం హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తాండూరులోనే అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.బాధిత కుటుంబ సభ్యులు బాలాజీ నర్సింగ్ హోం వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మేడ్చల్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా శరత్ కుమార్



**శామీర్ పేట్, అక్టోబర్ 15(జనం సాక్షి )**భారతీయ జనతా పార్టీ అలియాబాద్ మున్సి పాలిటీలో కష్టపడి పని చేస్తూ పార్టీ కోసం అనుక్షణం ముందుండి పార్టీ మంచి చెడు కోసం పార్టీ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగు తున్నటువంటి యువ నాయకులు శరత్ కుమార్ కు మేడ్చల్ రూరల్ జిల్లా యు మోర్చా ప్రధాన కార్యదర్శిగా పదవి బాధ్యతలు అప్పజెప్పారు. భారతీయ జనతా పార్టీ కోసం అనుక్షణం ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం పని చేస్తున్నటువంటి వారికి జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ , వివిధ మోర్చల నాయకులు ప్రతి ఒక్కరూ అనుకూలంగా నాకు పదవి బాధ్యతలు ఇవ్వడం చాలా సంతోషకరంగా భావిస్తానన్నారు. భారతీయ జనతా పార్టీ నియమ నిబంధనతో ప్రతి ఒక్క వ్యక్తి అభివృద్ధి లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగుతున్నటువంటి పార్టీగా యువకులకు,యువ నాయకులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం పార్టీ మునుముందు బీజేపీ అధికారంలోకి రావాలి అంటే యువకులు మా త్రమే కీలక పాత్ర పోషి ంచి యువకులు అంద రూ ఏకములై రాష్ట్రంలో అధికారంలోకి రావడం కీలకపాత్ర యువతదే ఉం దన్నారు. మనం యువ మోర్చాను మహిళా మో ర్చాను, వివిధ రకాల మోర్చాలను కలుపుకుం టూ పార్టీని పార్టీ విధివిధానాలను బలోపేతం చేస్తానని అన్నారు.

# పోలీస్ స్టేషన్ పనితీరుపై కమిషనర్ సమీక్ష



**శంషాబాద్,అక్టోబర్15(జనంసాక్షి)** రాష్ట్రం ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి , శంషాబాద్ జోన్ డీసీపీ శిరీష, షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ లక్ష్మీనారాయణ పెద్దషాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పనితీరును సమీక్షించారు. పెద్ద షాపూర్ ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి తో స్టేషన్ పనితీరును పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, దర్యాప్తులను వేగవంతం చేయాలని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

# విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

## మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం,అక్టోబర్ 15(జనంసాక్షి):**విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మహేశ్వరం మండలంలోని పోరండ్ల,కోళ్ల పడకల్ గ్రామాలల్లో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.వ్యవసాయ రంగాన్ని రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయాలన్నారు.రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమన్నారు.పంటలు ఎండిపోవడం వల్ల రైతుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలకమర్రి నర్సింహ, సీనియర్ నాయకుడు హన్మగల్ల చంద్రయ్య,పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పారిజాత నర్సింహ రెడ్డికి అభినందనలు తెలిపిన రాజు నాయక్



**మహేశ్వరం,అక్టోబర్15(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా పదవి బాధ్యతలు చేపట్టిన చిగురింత పారిజాత నర్సింహారెడ్డికి గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉప్పుగడ్డ తండా సర్పంచ్ నేనవాత్ రాజు నాయక్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాండు నాయక్,మాజీ ఎంపీటీసీ మునావత్ పాండు నాయక్, మాజీ సర్పంచ్ కృష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇక్రిసాట్‌లో రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ



**కొడంగల్, అక్టోబర్ 15 (జనం సాక్షి):**ఆత్మ పథకం కింద కొడంగల్ డివిజన్‌లోని నాలుగు మండలాల రైతులకు పటాన్‌చెరువులోని ఇక్రిసాట్ పరిశోధనా కేంద్రంలో ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నేల పరీక్షలు, ఎరువుల వినియోగంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.మట్టి నమూనాలను సేకరించే విధానం, నేల పరీక్షల విశ్లేషణ, సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా ఏ ఎరువులను ఎంత మోతాదులో, ఎప్పుడు ఉపయోగించాలో వివరించారు. కంది, జొన్న పంటల క్షేత్ర సందర్శన ద్వారా నూతన సాగు పద్ధతులు, యాజమాన్య పద్ధతులు, వ్యవసాయ యంత్రాల పనితీరును వివరించారు. మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శింపజేసి చిరుధాన్యాల పోషక విలువలు, వాటి ద్వారా తయారయ్యే ఉత్పత్తులు, ఉప ఉత్పత్తుల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు రంగనాథ్, యశ్వంత్, యోగేష్, ప్రియాంక, కొడంగల్ ఏడీఏ వెంకటేశం, ఏవో కొమురయ్య, ఆత్మ బీటీఎం బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

# దేశంలోని అన్ని జిల్లాల్లో ఏఐపీసీ కమిటీల ఏర్పాటు

- ◆ మధుయాష్కీ గౌడ్
- ◆ ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ
- ◆ పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నా.. మధుయాష్కీ
- ◆ వీడియో కాల్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన సామ్ పిట్రోడా

**హయత్ నగర్, అక్టోబర్ 15 (జనం సాక్షి):** దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) కమిటీలను ఏర్పాటు చేసి, వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేస్తామని మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తెలిపారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా ఆయన గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి నుంచి బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కీ గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ నేతలు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షి, రాజ్ పాల్ గౌతమ్, సీడబ్ల్యూసీ సభ్యులు గురుదీప్ సింగ్ సప్పల్, రాజ్యసభ సభ్యుడు దీపేందర్ సింగ్ హుడా, మాజీ ఎంపీ ఉదిత్ రాజ్ తదితరులు హాజరయ్యారు. ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ సామ్ పిట్రోడా వీడియో కాల్ ద్వారా సందేశాన్ని అందించి మధుయాష్కీ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐపీసీ నూతన గీతాన్ని దీపాదాస్ మున్షి విడుదల చేశారు.

**పదవి కాదు......బాధ్యతగా భావిస్తున్నా**

బాధ్యతల స్వీకరణ అనంతరం మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, ఏఐపీసీ చైర్మన్ పదవిని కేవలం హోదాగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 50 వేల మంది సభ్యత్వంతో పాటు, అభివృద్ధి చెందిన 100 పట్టణ జిల్లాల్లో ఏఐపీసీ కమిటీలను విస్తరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. పార్టీ విధానాల రూపకల్పనలో, దేశ అభివృద్ధికి అవసరమైన విధానాల తయారీలో వృత్తి నిపుణుల భాగస్వామ్యాన్ని పెంచుతామని వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించిన బోధించు, సమీకరించు, పోరాడు అనే సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఏఐపీసీ ని ముందుకు నడిపిస్తామని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడటం వంటి అంశాల్లో వృత్తి నిపుణులను భాగస్వాములను చేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ






ఆలోచనలకు అనుగుణంగా ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించే సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

**దేశ నిర్మాణంలో నిపుణుల పాత్ర కీలకం**

మాజీ ఏఐపీసీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ, వృత్తి నిపుణులు రాజకీయాలకు దూరంగా ఉండకుండా తమ అనుభవాన్ని, ఆలోచనలను దేశ నిర్మాణంలో వినియోగించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే వృత్తి నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ పార్టీ విధాన రూపకల్పనకు మరింత తోడ్పాటు అందించవచ్చని అన్నారు. ఏఐపీసీ తొలి చైర్మన్ శశి థరూర్, అనంతరం తాను సంస్థ బలోపేతానికి కృషి చేశామని, మధుయాష్కీ గౌడ్ కూడా సంస్థను మరింత విస్తరిస్తారనే విశ్వాసం ఉందని తెలిపారు. గురుదీప్ సింగ్ సప్పల్ మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థల ఆదాయాలు పెరుగుతున్నప్పటికీ ఉద్యోగుల వేతనాల పెరుగుదల ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. దేశంలోని వివిధ వ్యవస్థల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఎదుర్కొనేందుకు వృత్తి నిపుణుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, సైన్స్ అండ్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్ సహా వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారిని ఏఐపీసీ ద్వారా ఒక వేదికపైకి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో సంస్థను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

**అన్ని జిల్లాల్లో కమిటీల ఏర్పాటుకు సామ్ పిట్రోడా సూచన**

ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ సామ్ పిట్రోడా వీడియో కాల్ ద్వారా మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం దేశ పారిశ్రామిక, రవాణా, వ్యవసాయ, వైద్య, రైల్వే తదితర రంగాల అభివృద్ధిలో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిపుణులకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. దేశ అభివృద్ధికి అవసరమైన గణాంకాల సేకరణ, ప్రణాళికల రూపకల్పనలో వృత్తి నిపుణుల సేవలు కీలకమని పేర్కొన్నారు. దేశంలోని అన్ని జిల్లాల్లో ఏఐపీసీ కమిటీలను ఏర్పాటు చేసి వైద్యులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు సహా అన్ని రంగాల నిపుణులను భాగస్వాములను చేయాలని సూచించారు. రాజ్ పాల్ గౌతమ్ మాట్లాడుతూ, భారతదేశంలోని అన్ని వర్గాలకు విద్య, అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ చారిత్రక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని సేకరించి, దానికి అనుగుణంగా విధానాలను రూపొందించడంలో ఏఐపీసీ ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ఏఐపీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన చైర్మన్‌గా మధుయాష్కీ గౌడ్ బాధ్యతలు స్వీకరించడంతో దేశవ్యాప్తంగా సంస్థను విస్తరించేందుకు కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు నాయకులు తెలిపారు.

## విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి టెక్టా ఆధ్వర్యంలో వినతి

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 15 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సుమారు 3,000 రెగ్యులర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, రానున్న నియామకాల్లో కేవలం 500 పోస్టులకే పరిమితం కాకుండా పోస్టుల సంఖ్యను పెంచాలని కోరుతూ తెలంగాణ ఎడ్యుకేషనల్ జుజూా అధ్యక్షులు కె. వెంకటేశ్వర రెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు గురువారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ హైదరాబాద్ సహా రాష్ట్రంలోని సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరతను పరిష్కరించేందుకు తగిన సంఖ్యలో శాశ్వత అధ్యాపకులను నియమించాలని వారు కోరారు. అధ్యాపకుల నియామకాలు ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు, పరిశోధనాభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య



అం.దించడానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వినతిని సానుకూలంగా పరిశీలించి, రానున్న విశ్వవిద్యాలయాల నియామక ప్రక్రియలో పోస్టుల సంఖ్యను పెంచి, ఖాళీల భర్తీకి తక్షణ చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## పాం పాండ్ పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

కొడంగల్, అక్టోబర్ 15 (జనం సాక్షి): కొడంగల్ మండలం అప్పాయి పల్లి గ్రామంలో అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పాం పాండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని,వాటి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామ్ పాండ్ నిర్మాణం ద్వారా వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉష్రశ్రీ, ఎంపీవో రామేష్,ఏపీవో రాములు,ఏపీఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## జల వనరులను కాపాడాలి

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్**




మహేశ్వరం,అక్టోబర్ 15( జనంసాక్షి):జల వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ అన్నారు.గురువారం సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన మోర్చా ఆధ్వర్యంలో మహేశ్వరం మండలంలోని పడమట తండాలో నీటి సంరక్షణ జలవనరుల శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇండ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్క నర్సింహ రెడ్డి, పాపయ్య గౌడ్,కడారి జంగయ్య యాదవ్,కుంటే వెంకటేష్, పాండు నాయక్,విశాల్ నాయక్, పంతు నాయక్,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్,బీజేపీ మండల అధ్యక్షుడు యాదిష్, పడమటి తండా సర్పంచ్ వినోద్ నాయక్,పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమంలో భాగంగా పంటకుంట పరిశీలన

**అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్**



కొడంగల్, అక్టోబర్ 15 (జనం సాక్షి): జలసిరి కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ గురువారం కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామంలో పంటకుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నీటి సంరక్షణకు చేపడుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పుల వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, రీచార్జ్ స్ట్రక్చర్లు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు పనులకు హాజరై నీటి సంరక్షణ పనుల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో ఉష్రశ్రీ, ఏపీవో రాములు,ఎంపీవో రమేష్,ఏపీఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పిన మహిళా ఉద్యోగులు

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ బతుకమ్మ పాటలు, మహిళల సందడి, సమష్టి భాగస్వామ్యంతో కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సైతం మహిళా ఉద్యోగులతో కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పూజించి, పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, వేడుకల్లో పాల్గొన్న మహిళలకు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో డాక్టర్ నారాయణ, సీపీఓ డాక్టర్ సురేందర్, ఏవో వెంకట్రామిరెడ్డి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, ల్యాండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లావణ్య, బీసీ సంక్షేమ అధికారి జి.ఆశన్న, ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్ కుమార్, డీడబ్ల్యూఓ ఇన్‌ఛార్జి రాజేందర్, ఎఫ్‌డీఓ రజిని, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, వివిధ మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సీడీపీఓలు, సీడబ్ల్యూసీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

**పెద్దేముల్ (జనంసాక్షి):** మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై, స్థానిక నాయకులతో కలిసి స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



## విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి టెక్టా ఆధ్వర్యంలో వినతి



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సుమారు 3,000 రెగ్యులర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, రానున్న నియామకాల్లో కేవలం 500 పోస్టులకే పరిమితం కాకుండా పోస్టుల సంఖ్యను పెంచాలని కోరుతూ తెలంగాణ ఎడ్యుకేషనల్ టీఈసీటీఏ అధ్యక్షులు కె. వెంకటేశ్వర రెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు గురువారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ హైదరాబాద్ సహా రాష్ట్రంలోని సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరతను పరిష్కరించేందుకు తగిన సంఖ్యలో శాశ్వత అధ్యాపకులను నియమించాలని వారు కోరారు. అధ్యాపకుల నియామకాలు ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు, పరిశోధనాభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అం.దించడానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వినతిని సానుకూలంగా పరిశీలించి, రానున్న విశ్వవిద్యాలయాల నియామక ప్రక్రియలో పోస్టుల సంఖ్యను పెంచి, ఖాళీల భర్తీకి తక్షణ చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## నిజమైన పేదల పెన్నిధి పిఏసి చైర్మన్ అరికెపూడి : రాగం నాగేందర్ యాదవ్

### శేరిలింగంపల్లి ప్రజల జననీరాజనం.. వేల సంఖ్యలో హాజరైన అభిమానులు

### ఘనంగా వేడుకలను నిర్వహించిన ఉప్పలపాటి రఘునాథరెడ్డి అమిత్ పటేల్ చాంద్ పాషా



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** సేవే పరమావధిగా భావిస్తూ శేర్లింగంపల్లి ప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ నికార్సైన పేదల మనిషి అని శేరిలింగంపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్, సీనియర్ నేత రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు అరికెపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఆయనకు బహిరంగ జన్మదిన శుభాకాంక్షలను తెలియజేయడంతోపాటు ఎమ్మెల్యే నివాసం వద్దకు భారీగా నాయకులు కార్యకర్తలతో తరలివచ్చి వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలలో ఓవైపు మచ్చలేని నాయకునిగా కీర్తి శిఖరాలను అధిరోహిస్తున్న అరికెపూడి మరోవైపు స్వచ్ఛమైన ప్రజానేతగా శేర్లింగంపల్లి ప్రజల సంక్షేమం కోసం అహోరాత్రులు శ్రమిస్తూ శేరిలింగంపల్లి అభివృద్ధిలో తిరుగులేని ముద్రను వేయడం జరిగిందన్నారు. ఆయన రాజకీయాలలోకి రావడంకన్నా మునుపే అనేక సేవా కార్యక్రమాలద్వారా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి ప్రజా సంక్షేమం కోసం కృషిచేసిన మంచి మనిషి అరికెపూడి అని కొనియాడారు. రాగం నాగేందర్ యాదవ్ వెంట శేరిలింగంపల్లి డివిజన్ నాయకులు, కార్యకర్తలు, రాగం అభిమానులు వందల సంఖ్యలో హాజరయ్యారు.

**ప్రజాసేవే జీవిత లక్ష్యం : ఉప్పలపాటి శ్రీకాంత్ రఘునాథ్ రెడ్డి**

రాజకీయ నాయకులంటే ఏదో ఓట్లపుడే వచ్చి తర్వాత మొహం చాటేసే రకంకాదని, రాజకీయ నాయకునికి, జననాయకునికి ఉన్న అసలైన తేడాను రాష్ట్ర ప్రజాబద్ధల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ తన అవిశ్రాంత కృషిద్వారా నిరూపించడం జరిగిందని మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, పార్టీ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, చాంద్ పాషా, అమిత్ పటేల్ తదితరులు తెలిపారు. నేటితరం ప్రజా నాయకులకు ఎంతో ఆదర్శనీయమైన తన రాజకీయ జీవితాన్ని ప్రతిరోజు ప్రజా సంక్షేమం కోసమే వినియోగిస్తూ అరికపూడి అంటే శేరిలింగంపల్లి ప్రజలు... శేరిలింగంపల్లి ప్రజలంటే అరికపూడి అన్న చందంగా ప్రతిరోజు ప్రజల బాగోగుల కోసం పాటుపడుతున్న మహోన్నత నేత అని కొనియాడారు. ఈ సందర్భంగా ఎవరి వారు వ్యక్తిగతంగా జన్మదిన కేకులను కట్ చేసి అరికెపూడి గాంధీకి ఘనంగా శుభాకాంక్షలు అని తెలియజేయడంతోపాటు కేకును అభిమానులకు పంచిపెట్టి జీవితంలో మరిన్ని పదవులను ఆయన అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

**వేలాది మంది అభిమానుల సమక్షంలో ఘనంగా గాంధీ వేడుకలు**




అరికపూడి గాంధీ జన్మదిన వేడుకలు తమకు ఐదు రోజుల ముందే దసరా పండుగను తీసుకొచ్చాయని... అరికెపూడి గాంధీ జన్మదిన రోజైన అక్టోబర్ 15 తనకు నిజమైన దసరా పండుగ రోజు అని శేరిలింగంపల్లి ప్రజలు, అరికపూడి అభిమానులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. భారీ పూలమాలలు, జన్మదిన కేకులు, పువ్వుల బొకేలతో విచ్చేసిన ఆయన అభిమానులు అరికపూడిని కలిసి అంగరంగ వైభవంగా సత్కరించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా తత్పరతే ప్రధాన లక్ష్యంగా రాజకీయాలలో అంచలంచలుగా ఎదుగుతూ ఎమ్మెల్యేగా, రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ గా ఎదిగి రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఎన్ని అడ్డంకులు ఎదురుగా ఉన్నా నిరంతరం నియోజకవర్గంలోని పేదలను కలుసుకొని వారికోసం ఏదైనా మంచి చేయాలనే తపనతో ముందుకు సాగుతూ రాజకీయం అంటే సేవారంగం అని నూతన నిర్వచనాన్ని తెలియజేస్తున్న అరికెపూడి భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత కీలక పదవులను అందుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.



## అభివృద్ధే ప్రధాన లక్ష్యం

### బొంతు శ్రీదేవి యాదవ్

### చర్లపల్లి డివిజన్‌లోని బి.ఎన్. రెడ్డి నగర్‌లో రూ. 98 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కాప్రా, అక్టోబర్ 15 (జనం సాక్షి):** చర్లపల్లి డివిజన్ పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ కాలనీలో రూ. 98 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, డివిజన్ వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన, కాలనీల సమగ్ర అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పనుల నిర్వహణలో ఎలాంటి రాజీ పడకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొడిగ ప్రభు, రాజు గౌడ్, సదానందం, శంకర్, నవీన్, బాలు, కె. రాజు, సురేష్ మహారాజ్, కె. రాజు, టి. లక్ష్మణ్, చరణ్ చారి, వెంకట్ రెడ్డి, మూర్తి, చెన్నం గోపి, వెంకట్ గౌడ్, గణేష్ గౌడ్, మధు, భాను చందర్, సబిత, నవనీత, సంధ్య, సత్తెమ్మ పాల్గొన్నారు.



# బతుకమ్మ, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయాలకు ప్రతీక

- గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా
- లోక్ భవన్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు
- బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ దంపతులు
- గౌరమ్మకు గవర్నర్ దంపతుల ప్రత్యేక పూజలు.. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థన



హైదరాబాద్, అక్టోబరు 15, (జనం సాక్షి ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు , స్త్రీశక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల్లో ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని, సాంస్కృతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. పుష్పాలనే దైవ స్వరూపంగా భావించి పూజించే ప్రకృతి ఉత్సవం బతుకమ్మ పండుగ అని గవర్నర్ పేర్కొన్నారు . గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన తన సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి పాల్గొని, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ... పూలతో అలంకరించిన బతుకమ్మ ప్రకృతి సౌందర్యానికి, జీవన వైభవానికి, మానవాళికి ప్రకృతితో ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతిబింబమని అన్నారు. ప్రకృతిని పరిరక్షించడం, సహజ వనరులను గౌరవించడం, పర్యావరణం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి విలువలను ఈ పండుగ చాటిచెబుతుందని తెలిపారు. బతుకమ్మ మహిళల సృజనాత్మకతకు, ఆత్మగౌరవానికి, సామాజిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. జానపద గీతాలు, కళలు, సంప్రదాయ ఆచారాల ద్వారా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని సజీవంగా నిలుపుతున్న మహిళల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ అమూల్యమైన వారసత్వాన్ని పరిరక్షించి, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రకృతి పరిరక్షణ, మహిళా సాధికారత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సామాజిక సామరస్యానికి ప్రాధాన్యమిస్తూ తెలంగాణ పురోగతి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యతను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

## వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

లోక్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో సుమారు 400 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు , లోక్‌భవన్ మహిళా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. గౌరీదేవి ప్రతిరూపాల చుట్టూ మహిళలంతా చేరి, చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా ఉయ్యాల పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు.

కోలాటాల కోలాహలంతో అమ్మవారికి నీరాజనాలు పట్టారు. కుటుంబ క్షేమాన్ని కాంక్షిస్తూ, తమ సౌభాగ్యాన్ని నిండు నూరేళ్ల కాపాడమంటూ ఆ తల్లిని మనసారా వేడుకున్నారు. అనంతరం బతుకమ్మలను గవర్నర్ సతీమణి శ్రీమతి జానకి శుక్లా, మహిళా ఉద్యోగినులు లోక్ భవన్ లోని కొలనులో నిమజ్జనం చేశారు. కోలాట బృందాల సందడి, బతుకమ్మ పాటల మధురిమతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ కళను సంతరించుకోనుంది.

## రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో... లోక్ భవన్

బతుకమ్మ పండుగ వేళ లోక్ భవన్ రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో జిగేల్‌మంటూ వెలిగిపోయింది. పూల పండుగైన బతుకమ్మకు ఈ విద్యుత్ కాంతులు అదనపు శోభను ఇచ్చాయి. వేడుకల్లో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణ్ కోమండూర్ , ఉప కార్యదర్శి పల్లవి , ప్రెస్ సెక్రెటరీ మామిండ్ల దశరథం ,అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య పరిష్కారం దిశగా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**సూర్యనాయక్ తండా సర్పంచ్ హీరు నాయక్**

బొంరాస్‌పేట, అక్టోబర్ 15 (జనం సాక్షి): సూర్యనాయక్ తండాలో త్రాగునీటి సరఫరాకు ఎదురు అవుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ హీరు నాయక్ తెలిపారు. గురువారం నూతన ట్రాన్స్ఫార్మర్ ను ఉప సర్పంచ్ వెంకటేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి గ్రామ ప్రజలకు త్రాగునీరు ఇబ్బంది లేకుండా చూడడమే లక్ష్యంగా నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ శేఖర్, తండావాసులు మోతిలాల్, రవి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్లకు ఘన సన్మానం



బొంరాస్ పేట (జనం సాక్షి): మండల పరిధిలోని మెట్లకుంట గ్రామంలోని బూత్ నంబర్ 190 లో గురువారం బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్, బాబయ్య నాయుడు,ఉప్పు జగదీష్,నాగు రావు,రాజా రామ్ రెడ్డి, మల్లేశం, ఆలమయ్య, ముకుందం, మహేందర్ గౌడ్ మహేష్, వెంకటయ్య,హనుమంతు పాల్గొన్నారు.

## దుర్గామాత సన్నిధిలో ప్రత్యేక పూజలు

బొంరాస్ పేట, అక్టోబర్ 15 (జనంసాక్షి): మండల పరిధిలోని మెట్లకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత సన్నిధిలో గురువారం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మహేష్, వెంకటయ్య, హనుమంతు, కృష్ణ ,భవాని ఉన్నారు.





ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ గా మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యాదవ్ కో-ఆపరేటివ్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

హయత్ నగర్, అక్టోబరు 15 (జనంసాక్షి):

## చెత్త సేకరణకు రాని వాహనాలు..

### దోమలు, ఈగలతో వ్యాధుల భయం

జవహర్ నగర్ అక్టోబర్ 15 ( జనంసాక్షి): జవహర్ నగర్‌లోని గబ్బిలాల పేటలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని, దీంతో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. చెత్త కుప్పలతో దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధి కుక్కలు, పశువులు చెత్తను రోడ్లపైకి లాగుతు ఒడటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని పేర్కొం టున్నారు. జవహర్ నగర్ నుంచి కీసరలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయం సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో రోజువారీ కూలీలు, నిరుపేద కుటుంబాల ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఫోన్ల ద్వారా సంప్రదించినా స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, ప్రతిరోజూ చెత్త సేకరణ వాహనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా 'డ్యాన్సింగ్ విత్ జాయ్' పుస్తక ఆవిష్కరణ

### ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి ఆనంద శంకర్ జయంత్ రచన




హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి ఆనంద శంకర్ జయంత్ రచించిన 'డ్యాన్సింగ్ విత్ జాయ్' పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. గరుడ ప్రకాశన్ ప్రచురించిన ఈ పుస్తకంలో కళ, జీవితం, క్యాన్సర్‌పై ఆమె సాధించిన విజయాన్ని పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం కేవలం నృత్యం గురించి మాత్రమే కాదన్నారు. పట్టుదల, కఠోర శ్రమ, దృఢ సంకల్పం ద్వారా లభించే అసాధారణ బలానికి సంబంధించిన ఒక శక్తివంతమైన కథనమని అభివర్ణించారు. డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ క్యాన్సర్‌పై సాగించిన పోరాట ప్రయాణాన్ని ఈ పుస్తకంలో వివరించిన తీరును ప్రస్తావిస్తూ ఇది కేవలం క్యాన్సర్‌కు సంబంధించిన పుస్తకం మాత్రమే కాదని, క్యాన్సర్‌ను దాటిన జీవన ప్రయాణమని పేర్కొన్నారు. మనసులో ప్రగాఢంగా నాటుకున్న అభిరుచి జీవితంలోని అత్యంత క్లిష్ట సమయాల్లో ఒక ఆలంబనగా నిలవడమే కాకుండా, కష్టాలను సైతం ఆత్మపరిశీలనకు ఒక అవకాశంగా మార్చుకోవడానికి దోహదపడుతుందని వ్యాఖ్యానించారు. డాన్సర్లోని 'డీ' అక్షరం రచయిత్రికి 'క్యాన్సర్' లోని 'సీ'ని అధిగమించడానికి తోడ్పడిందన్నారు.







## ఎల్‌నినో ప్రభావంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలి

**శంకర్ పల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని శంకరపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి .ప్రవీణ్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక అధికారి చేవెళ్ల వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు సురేష్ బాబు అధ్యక్షతన గ్రామ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. వర్షాలు సమృద్ధిగా కొరవనందున రాబోయే రోజుల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. వర్షాలు సాధారణ కంటే తక్కువగా కురిసినందున ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవా లని, నీటిని వృధా చేయరాదని, భూగర్భ జలాల పెంపు కోసం ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి గిరిరాజ్, వ్యవసాయ అధికారి చైతన్య, ఆయా శాఖల అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య ఐక్యత చాటుతాయి

### జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి

### ఘనంగా బతుకమ్మ వేడుకలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ( జనం సాక్షి):** సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, ఆత్మీయతను మరింత బలోపేతం చేస్తాయని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల మహిళ విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ... తెలంగాణ అస్తిత్వానికి మహిళల ఆత్మగౌరవానికి ప్రత్యేకగా నిలిచిన పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. మహిళ ఉద్యోగులు ఐక్యంగా పాల్గొని సాంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ సంబరాలను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతికి వారసత్వానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం మహిళ విభాగం చైర్మన్ రేవతి, శాంతి శ్రీ, సైదమ్మ, అనిత, పావని, వినీత, కవిత, శాంతి రేఖ, రోజా, హెప్సిబా, ఉదయ, స్వాతి, శైలజ, స్రవంతి, అనిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మకం.. రుచికరం.. జై భవాని టిఫిన్ సెంటర్



**బంట్వారం (జనంసాక్షి) :** బంట్వారం మండలంలో కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చి టిఫిన్ సెంటర్ పెట్టారు అందరికీ రుచికరమైన టిఫిన్స్ పరిశుభ్రత కలిగినటువంటి మంచి రుచికరమైన టిఫిన్స్ ను నమ్మకం తోటి నాణ్యత కలిగినటువంటి ఆహార పదార్థాలతో టిఫిన్ తయారు చేసి 50 రూపాయలకే అందిస్తున్నారు వారు కష్ట చేస్తున్న పని అంచలంచలుగా కొంత అభివృద్ధి చెందుకొని ఇరువురిని వారితో పాటు పనిలో పెట్టుకోవడం జరిగింది సాయంకాలము మిర్చీలు, ఆల్ బజ్జీలు పులుకలు చేసి వాటిని 50 రూపాయలకు ఒక ప్లేట్ అమ్ముకోవడం జరుగుతుంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో కష్టపడి అందరికీ రుచికరమైనటువంటి టిఫిన్స్ అందిస్తున్నారు. దిగంబరంకు భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. రెక్కాడితేనే డొక్క నిండాదంటున్నా దిగంబరం ప్రభుత్వ పరంగా నాకు కొంత సహాయం చేస్తే నేను ఇంకను కొందరికి ఉపాధి కల్పించడానికి ముందుకు వస్తానన్నారు.

## బంట్వారం మండలం నుండి బదిలీపై వెళ్తున్న ఎస్ఐ విమలకు సన్మానం



**బంట్వారం, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** బంట్వారం మండలం స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న విమలను మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు. బంట్వారం మండలంలో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు కొనసాగించడంలో ఆమె తనవంతు పాత్ర పోషించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ విమలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విజయలక్ష్మి, సర్పంచులు కమలమ్మ, భాగ్యమ్మ, గోరెమియా, సంజీవయ్య, బాలయ్య, స్వప్న, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు వెంకటేశం, నాయకులు హరీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, నరసింహులు, రాధాకృష్ణ, సంగమేశ్వర్, కరుణాకర్ రెడ్డి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సాక్షిగా ఐక్యపోరు

### మహిళలకు సమాన వేతనం కల్పించాలి : సీఐటీయూ శ్రామిక మహిళా కమిటీ కన్వీనర్ పద్మశ్రీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి)**

పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, పని ప్రదేశాల్లో వివక్షను రూపుమాపాలని సీఐటీయూ శ్రామిక మహిళా కమిటీ కన్వీనర్ పద్మశ్రీ డిమాండ్ చేశారు. మహిళా కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. చర్లపల్లిలోని సూరానా చౌరస్తాలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యంగ్ వర్కర్స్ (సీఐటీయూ అనుబంధం) కన్వీనర్ కేఎస్ఎస్ మణికంఠ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వివిధ పరిశ్రమలకు చెందిన సీఐటీయూ మహిళా నాయకులు పాల్గొన్నారు.

**మహిళల ఐక్యతకు బతుకమ్మ ప్రతీక :** పద్మశ్రీ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళల ఆత్మగౌరవం, ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. కులమతాలు, వర్గ భేదాలకు అతీతంగా మహిళలంతా ఐక్యంగా నిలిచి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి, శ్రామిక మహిళల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు.



**మహిళలపై వివక్షను రూపుమాపాలి**

సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో మహిళా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో వివక్ష, వేధింపులకు తావులేకుండా చూడాలని యాజమాన్యాలను కోరారు. మహిళా కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంగ్ వర్కర్స్ (సీఐటీయూ అనుబంధం) కన్వీనర్ కేఎస్ఎస్ మణికంత మాట్లాడుతూ.. మహిళా కార్మికుల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని అన్నారు. మహిళలపై వివక్షను రూపుమాపి సమాన హక్కులు కల్పించాలని కోరారు. పరిశ్రమల్లో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ స్ఫూర్తితో కులమతాలకు అతీతంగా మహిళలంతా ఏకమై హక్కుల సాధనకు ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీఐటీయూ కోశాధికారి పి.గణేష్, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బివి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రేవతి కళ్యాణి,ఎపిరాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు నాచారం నాయకులు రమేష్, వివిధ పరిశ్రమల కంపెనీల యూనియన్ నాయకులు, కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు





## కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పిన మహిళా ఉద్యోగులు

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ బతుకమ్మ పాటలు, మహిళల సందడి, సమష్టి భాగస్వామ్యంతో కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సైతం మహిళా ఉద్యోగులతో కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పూజించి, పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, వేడుకల్లో పాల్గొన్న మహిళలకు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో డాక్టర్ నారాయణ, సీపీఓ డాక్టర్ సురేందర్, ఏవో వెంకట్రామిరెడ్డి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, ల్యాండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లావణ్య, బీసీ సంక్షేమ అధికారి జి.ఆశన్న, ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్ కుమార్, డీడబ్ల్యూఓ ఇన్‌ఛార్జి రాజేందర్, ఎఫ్‌డీఓ రజిని, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, వివిధ మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సీడీపీఓలు, సీడబ్ల్యూసీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# విష్ణుపురి కాలనీలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

### అన్నదాన కార్యక్రమానికి బండి సతీష్ గౌడ్‌కు ఆహ్వానం

**బోడుప్పల్-జనంసాక్షి :** మేడిపల్లి డివిజన్ పరిధిలోని విష్ణుపురి కాలనీలో జై భవాని అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి సతీష్ గౌడ్‌ను ముఖ్య అతిథిగా హాజరుకావాలని జై భవాని అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఉత్సవాల నిర్వహణ, అన్నదాన కార్యక్రమానికి చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదాన సేవను అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు కాలనీవాసుల మధ్య ఐక్యత, సోదరభావం, సామాజిక అనుబంధాలను బలోపేతం చేస్తున్నాయి. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణ, ప్రేమ్, అభిలాష్ రెడ్డి, అరుణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐదవ రోజు శ్రీ లలితా గౌరి త్రిపుర సుందరి దేవిగా నిమిషాంబ అమ్మవారి దివ్యదర్శనం

### జ్ఞానప్రదాయినిగా, విద్యాస్వరూపిణిగా అమ్మవారి అలంకరణ..

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

### బోడుప్పల్‌లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



**బోడుప్పల్-జనంసాక్షి :** శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారు శ్రీ లలితా గౌరి త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. జ్ఞానప్రదాయినిగా, విద్యాస్వరూపిణిగా, సృష్టి-స్థితి-లయకారిణిగా కొలువు దీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలతో పూజించడం విశేషం. 5వ రోజు శ్రీ లలితా గౌరి త్రిపుర సుందరి దేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని భక్తితో ఆరాధించడం వల్ల జ్ఞానం, శక్తి, సకల శుభాలు సిద్ధిస్తాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అమ్మవారి కటాక్షం ఉంటే జీవితంలో ఎలాంటి ఆటంకాలనైనా అధిగమించవచ్చని భక్తులు నమ్ముతారు.

**అమ్మవారి కృపతో సకల శుభాలు కలగాలి**

శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారి ఆశీస్సులు సమస్త భక్తులపై ఉండాలని, ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి. ఈ ఆలయం శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం, హంపీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. అమ్మవారి దివ్యదర్శనంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భక్తిభావం వెల్లివిరుస్తోంది.

# నవరాత్రి వేడుకల్లో దుర్గామాతకు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ప్రత్యేక పూజలు

### రాజీవ్ నగర్ ఫేజ్-2 కాలనీకి కమ్యూనిటీ హాల్ మంజూరు

### కృషి చేసిన బొమ్మక్ కళ్యాణ్ కు కాలనీ వాసుల కృతజ్ఞతలు



**బోడుప్పల్-జనంసాక్షి :** దేవీ నవరాత్రి ఉత్సవాల పవిత్ర సందర్భంగా బోడుప్పల్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ దుర్గామాత ఆలయాన్ని బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దుర్గామాత ఆశీస్సులు పొందారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**రాజీవ్ నగర్ ఫేజ్-2 కాలనీకి కమ్యూనిటీ హాల్ మంజూరు**

బోడుప్పల్ డివిజన్‌లో పరిదిలోని రాజీవ్ నగర్ ఫేజ్-2 కాలనీకి కమ్యూనిటీ హాల్ మంజూరు కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసుల అవసరాలను గుర్తించి, వారి సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేసినందుకు కళ్యాణ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వస్తే కాలనీలో జరిగే సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, ఇతర శుభకార్యాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కాలనీ అధ్యక్షులు సారయ్య, రాజీవ్ నగర్ ఫేజ్-2 కాలనీ అధ్యక్షులు నరేష్, కాలనీ సలహాదారు నరేందర్, కోశాధికారి సంతోష్, యూత్ కాంగ్రెస్ సభ్యులు అరవింద్‌తో పాటు కాలనీ సభ్యులు దుర్గయ్య, ముత్యాలు, వెంకటేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ చౌరస్తాలో పూల హారతి

- అంబరాన్నంటిన బతుకమ్మ మహాసంబురాలు
- పూల పండుగతో పులకించిన అంబేద్కర్ చౌరస్తా
- ఆటపాటలు, కోలాటాలతో మార్మోగిన ప్రాంగణం
- మల్‌రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

**రంగారెడ్డి, అక్టోబర్ 15 (జనంసాక్షి)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వైభవం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం రాత్రి కన్నులపండువగా సాగింది. మల్‌రెడ్డి యువశక్తి నేతృత్వంలో నిర్వహించిన ఈ మహాసంబురాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల ఉత్సాహభరితమైన ఆటపాటలు, ఉయ్యాల పాటలు, కోలాటాలతో అంబేద్కర్ చౌరస్తా అచ్చం పూలవనాన్ని తలపించింది. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన మన సంస్కృతికి అద్దం పట్టేలా ఈ వేడుకలు ఘనంగా రూపుదిద్దుకున్నాయి.

ఈ మహాసంబురాలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి యువశక్తి కన్వీనర్ మల్‌రెడ్డి స్నేహ-అభిషేక్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు చిగురింత పారిజాతానర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇబ్రహీంపట్నంతో పాటు చుట్టుపక్కల వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చి, తమ సృజనాత్మకతను ప్రతిబింబించేలా అందమైన బతుకమ్మలను పేర్చి తీసుకువచ్చారు. తంగేడు, గునుగు తదితర రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రాంగణమంతా పండుగ శోభను నింపాయి.

**ఉయ్యాల పాటలు.. కోలాటాలతో హోరు..**

ఫోక్ సింగర్ భవానీ, నల్గొండ గద్దర్ నర్సిరెడ్డి నేతృత్వంలో సాగిన ఉయ్యాల పాటలు మహిళల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. తరతరాలుగా తెలంగాణ పల్లెల్లో ప్రతిధ్వనిస్తున్న బతుకమ్మ పాటలు మరోసారి ఆడబిడ్డల గొంతుల్లో సజీవమయ్యాయి. పాటల తాళానికి అనుగుణంగా మహిళలు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ



ఆడిపాడారు. సంప్రదాయ కోలాటాలు, జానపద గీతాలతో ప్రాంగణమంతా పండుగ సందడితో మార్మోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి స్నేహ మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో మమేకమయ్యారు. ప్రజాప్రతినిధులు మహిళలతో కలిసి పండుగ సంబరాలను పంచుకోవడంతో అక్కడి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. మహిళల ఆనందోత్సాహాలు, బతుకమ్మ పాటల సందడి ఇబ్రహీంపట్నంలో పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి.

**విజేతలకు నగదు బహుమతులు..**

బతుకమ్మ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మలను అందంగా పేర్చి తీసుకువచ్చిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహ బహుమతుల ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ. 25,000 జయమ్మ (మంచాల మండలం), హంసమ్మ ఇబ్రహీంపట్నం, రెండో బహుమతి రూ.15,000 మంజుల (యాచారం మండలం, తాడిపర్తి), మూడో బహుమతి రూ.10,000 లావణ్య (ఇబ్రహీంపట్నం) గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. బతుకమ్మ పండుగను కేవలం ఒక పోటీగా కాకుండా, మహిళల ఐక్యతకు, సంప్రదాయాల పరిరక్షణకు, పరస్పర ఆత్మీయతకు వేదికైందని అతిథులు తెలిపారు.



